ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

ముఖ్యాంశాలు

- రానున్న 5 సంవత్సరాలలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు అధికారులను కోరారు.
- రాష్ట్ర అభివృద్ధికి ఎన్ డి ఏ కూటమి కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ లను ఏర్పాటు చేస్తామని హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.
- విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు.
- నైఋతి పశ్చిమ గాలుల ప్రభావంతో రాష్ట్రంలో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

రాష్ట్రంలో ఉపాధి కల్పన కోసం ప్రభుత్వం పారిశ్రామికవేత్తలు కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు కోరారు. నైపుణ్య శిక్షణ, సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్ శాఖల అధికారులతో అమరావతిలోని సచివాలయంలో ఆయన ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బహుళజాతి కంపెనీలతో కలసి శిక్షణా కేంద్రాల ఏర్పాటు ప్రక్రియను ప్రభుత్వం చేపట్టాలని సూచించారు. నైపుణ్య శిక్షణ ద్వారా పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులు సమకూర్చాలని అధికారులను కోరారు. హైబ్రిడ్ విధానంలో ఇంటి వద్దనుంచే పనిచేసే కార్యక్రమానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కాగా, రానున్న 5 సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళికలను రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

==============================

రాష్ట్ర అభివృద్ధికి NDA కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరు మండలం మంచినీళ్ళపేట గ్రామంలో ఈ రోజు నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వంద రోజుల పాలనలో రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, దీపావళి నుంచి పేదలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను అందిస్తామని అన్నారు. స్థానికంగా ఫిష్ ల్యాండ్ సెంటర్ ను త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

==============================

రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ను ఏర్పాటు చేస్తామని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. విజయవాడలో ఈరోజు మానవ అక్రమ రవాణాతో పాటు, సైబర్ నేరాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నిర్వహించిన జాతీయ సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు, మహిళలలో అవగాహన పెంచడం ద్వారానే సైబర్ నేరాలను అరికట్టగలమని అన్నారు. చిన్నారులు, మహిళల రక్షణే ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతగా హోమ్ మంత్రి పేర్కొంటూ...

వాయిస్ బైట్ : హోమ్ మంత్రి అనిత

(వాయిస్ 33 సెకన్లు)

==============================

పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపడతామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శ్రీకాకుళం నగరంలోని పాఠశాలలను ఆయన ఈరోజు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ, విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువస్తామని, మేలైన విద్యా విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు.

==============================

రాష్ట్రంలో అమలు జరుగుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాలపైన అమరావతిలోని సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో ఈ రోజు సమీక్ష నిర్వహించారు. పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి, హోం, నైపుణ్య అభివృద్ధి, తదితర శాఖలలో వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరును ఆయా పథకాల పురోగతిని ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ పిఆర్ అండ్ ఆర్డి శాఖలో మొత్తం 22 కేంద్ర ప్రాయోజిత పథకాలను ఆ శాఖలో అమలు చేస్తున్నామని వివరించారు.

==============================

విజయనగరం జిల్లా కోరుకొండలో రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న సైనిక పాఠశాలను పూర్వ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థులతో ఆయన సంభాషించారు. పచ్చటి పరిసరాల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగుతున్న విద్యా బోధన తీరుని ఆయన ప్రశంసించారు. విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధే లక్ష్యంగా బోధన అందించడం సంతోషకరమని అన్నారు. భవిష్యత్తులో భారత సైన్యంలో చేరి సేవలందించాలనుకునే విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణ లభిస్తోందని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

==============================

కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం వంద రోజుల పాలనలో మధ్య తరగతి ప్రజలకు లబ్ధి చేకూర్చే విధంగా అనేక చర్యలను తీసుకున్నారు. ఆధునిక మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ఉపాధి అవకాశాలు లభించేలా కేంద్ర ప్రభుత్వం ప్రణాళికను రూపొందించింది. మధ్య తరగతి, పేద వర్గాలు సాధికారత సాధించడానికి వివిధ పథకాలు ప్రోత్సాహం అందించాయి. దేశంలో 28 వేల 600 కోట్ల రూపాయల ఖర్చుతో 12 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక కేంద్రాలను ఏర్పాటు చేశారు. దేశంలో కనెక్టివిటీని పెంచి ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు పూణే, థానే, బెంగళూర్ నగరాల్లో 30 వేల 700 కోట్ల రూపాయలతో మెట్రో ప్రోజెక్టులకు శ్రీకారం చుట్టారు. ప్రశ్న పత్రాల లీకేజీను అరికట్టడానికి పబ్లిక్ పరీక్షల చట్టం తీసుకురావడం జరిగిందని అధికార వర్గాలు తెలిపాయి.

==============================

విరామం

==============================

స్వచ్ఛ శ్రీకాకుళం జిల్లా ప్రజలందరి బాధ్యత అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం నగరంలో ఈ రోజు నాగావళి నది పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నదుల పరిశుభ్రత కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ, నాగావళి వంశధార నదుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. జిల్లా పోలీస్ సూపరెండేంటెండ్ కేవీ మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ, పోలీస్ యంత్రాంగం సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తోందని అన్నారు.

============================

రాష్ట్రంలో నైరుతి పశ్చిమ దిశగా వీస్తున్న గాలుల ప్రభావంతో పలు జిల్లాలలో తేలిక పాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర కోస్తా జిల్లాలలో రాబోయే మూడు రోజుల్లో ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. ఆ వివరాలను అమరావతిలోని వాతావరణ అధికారి తెలియచేస్తూ...

వాయిస్ బైట్ :  వాతావరణ శాఖ అధికారి

(వాయిస్ 33  సెకన్లు)

==============================

తీరప్రాంత అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పురపాలక  పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. విజయవాడలో ఈరోజు నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ, 972 కిలోమీటర్ల మేర రాష్ట్రంలో తీరప్రాంతం కలిగి ఉందని అన్నారు. వాతావరణ మార్పుల యుగంలో తీరప్రాంతంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తీరప్రాంతాలను అభివృద్ధి చేసే ప్రణాళికతో ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కాగా, తీర ప్రాంత సవాళ్ళను అధగమించడం కోసం కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి కేటాయింపులు చేశారని మంత్రి గుర్తు చేశారు.

==============================

చిత్తూరులోని కట్టమంచి చెరువు సుందరీకరణ పనులను చేపడతామని చిత్తూరు లోక్ సభ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. కలెక్టర్ సుమిత్ కుమార్, స్థానిక శాసన సభ్యులు గురజాల జగన్ మోహన్ లతో కలసి ఆయన ఈరోజు చెరువు కట్టను పరిశీలించారు. బలహీనంగా ఉన్న కట్ట ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తూ, సుందరీకరణ పనులను చేపట్టే విషయంపై కలెక్టర్ తో ఆయన ఈ సందర్భంగా చర్చించారు.

==============================

దసరా ఉత్సవాల నేపథ్యంలో ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్  రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ప్రత్యేక బస్సులను నడిపేందుకు ప్రణాళికలను సిద్ధం చేసిందని అధికారులు తెలిపారు. హైదరాబాద్ తో పాటు విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, బెంగళూరు, చెన్నైలకు ప్రత్యేక బస్సులను నడపనున్నామని వివరించారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు 353, రాజమహేంద్రవరానికి 241, విశాఖపట్నంకు 90, బెంగళూరుకు 14, చెన్నైకు 22, ఇతర ప్రాంతాలకు 244 బస్సులను నడుపనున్నామని తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు  అక్టోబర్ 3 నుండి  అక్టోబర్ 15వ తేదీ వరకు 13 రోజుల పాటు నడుపుతామని అధికారులు పేర్కొన్నారు.

============================

తూర్పుగోదావరి జిల్లా కడియంలో చిరుత సంచారాన్ని గుర్తించామని జిల్లా అటవీ శాఖాధికారి భరణి తెలిపారు. స్థానిక నర్సరీల్లో చిరుత సంచరిస్తున్నట్లుగా గమనించామని ఆచూకీ కోసం డ్రోన్ కెమెరాలు వినియోగిస్తున్నామన్నారు. అదే విధంగా చిరుత బారి నుంచి కాపాడుకునేందుకు నర్సరీ రైతులకు అవగాహన కల్పించామని ఆయన తెలిపారు. చిరుతను బంధించడానికి ట్రాంక్విలైజర్ వినియోగానికి సిద్ధంగా ఉంచామని వెల్లడించారు.

==============================

తిరుపతి జిల్లాలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని మన్నవరం బెల్ పరిశ్రమను స్థానిక శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డితో కలిసి ఆయన ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా బెల్ పరిశ్రమ అధికారులతో సమావేశమై ప్రాజెక్టు విస్తరణ, భూ అవసరాలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న NBPPL పరిశ్రమను విస్తరించే ఆలోచనలో ఉన్నామని తెలిపారు.

============================